'జవహర్ నవోదయ'కు దరఖాస్తులు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో ప్రవేశాలకు ఈ నెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మావతి కోరారు. గురువారం ఆమె మాట్లాడుతూ 9, 11వ తరగతుల్లో చేరాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే 08512-294545 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

రాయలసీమ వర్సిటీలో దాహం కేకలు..!



- విద్యార్థులను వేధిస్తున్న తాగు నీటి సమస్య
- పైపులైన్ నిర్మించినా నీటిని మళ్లించని దుస్థితి
- వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా
- ఏడాదికి రూ.75 లక్షల ఖర్చు





కర్నూలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ విశ్వవిద్యాలయం విద్యార్థులు నీటి సమస్యతో తల్లడిల్లుతున్నారు. కర్నూలు కార్పొరేషన్ అధికారులు తాగునీరు సరఫరా చేయడం లేదు. దీంతో వర్సిటీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. నీటి కోసం నెలకు రూ.6.50 లక్షలు చొప్పున ఏడాదికి సరాసరి రూ.75 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు. యూనివర్సిటీకి ఇది ఆర్థిక భారమే కాక.. విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కర్నూలు నగర శివారున 2008లో రాయలసీమ యూనివర్సిటీని స్థాపించారు. యూజీసీ అక్రిడిటేషన్ కలిగిన ఈ వర్సిటీలో 14 పీజీ, యూజీ కోర్సులు, అనుబంధంగా ఇంజనీరింగ్ కళాశాల కూడా ఉంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1,200 మంది విద్యార్థులు పీజీ సహా ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఇంజనీరింగ్ కోర్సు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు యూనివర్సిటీ హాస్టళ్లలో ఉంటూ చదువుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. బాలికల హాస్టల్‌లో 470 మంది, బాలుర హాస్టల్‌లో 450 మంది విద్యార్థులు ఉంటున్నారు. ప్రధానంగా తాగునీటి సమస్య విద్యార్థులతో పాటు అధ్యాపకులను వెంటాడుతోంది. నీటి సమస్య తీర్చాలంటూ 15 ఏళ్లుగా విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఏ ప్రభుత్వం కూడా వర్సిటీలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో వేసవి కాలంలో విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. శుద్ధి చేసిన తాగునీటి సరఫరా చేయాలంటూ 2016లో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అప్పటి కలెక్టరు కర్నూలు కార్పొరేషన్ అధికారులతో చర్చించి తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కర్నూలు కార్పొరేషన్ ఇంజనీర్లు రూ.1.13 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. దీంతో యూనివర్సిటీ అధికారులు రూ.81.68 లక్షలు చెల్లించారు.

మిగతా 6లో..

కర్నూలులో జాతీయ ఫాగ్సి సదస్సు

- 9, 10 తేదీల్లో ఏర్పాటు
- హాజరు కానున్న 500 మంది గైనిక్ వైద్యులు



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9, 10 తేదీల్లో కర్నూలులో మొట్టమొదటిసారిగా జాతీయ ఫాగ్సి కాన్ఫరెన్స్ (గైనకాలజీ) నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీకల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. వెంకటరమణ, వి. రాధాలక్ష్మీ వెల్లడించారు. ఈ మేరకు కర్నూలు మెడికల్ కాలేజీలోని కేఎంసీ అల్యూమి అసోసియేషన్‌లో సొసైటీ కోశాధికారి డాక్టర్ పి.మమత, డాక్టర్ వెంకటనారాయణతో కలిసి వారు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. జాతీయ సదస్సుకు 500 మంది వైద్యులు ఏపీ, తెలంగాణ కర్ణాటక రాష్ట్రాల నుంచి వైద్యులు వస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సు ప్రారంభోత్సవం నగరంలోని మౌర్యఇన్ హోటల్‌లో జరుగుతుందన్నారు. సదస్సుకు ఫాగ్సి జాతీయ కార్యదర్శి డాక్టర్ మాధురీ పటేల్, జాతీయ మాజీ అధ్యక్షురాలు డాక్టర్ శాంతకుమారి హాజరవుతారన్నారు. ఈ సదస్సును మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారన్నారు. 9న కర్నూలు మెడికల్ కాలేజీ, 10వ తేదీన జమ్‌కేర్ కామినేని హాస్పిటల్, కర్నూలు మెడికల్ కాలేజీలో వర్క్‌షాపు ఉంటుందన్నారు.

'దీపం-2' పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

జాయింట్ కలెక్టర్ బి.నవ్య



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెల్ల రేషన్‌కార్డు కలిగి అర్హత ఉన్న వారందరూ దీపం-2 పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకంపై జేసీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పథకానికి సిక్స్ స్టెప్స్ వాల్యుయేషన్ ఉందన్నారు. ల్యాండ్, ఎలక్ట్రిసిటీ, ట్రాన్స్‌పోర్ట్, ఇన్‌కమ్ ట్యాక్స్, ఇంటి పన్ను తదితర వాటిని పరిగణనలోకి తీసుకుని ఆ తర్వాత అర్హత నిర్ణయిస్తామన్నారు. గ్యాస్ ఏజెన్సీల ద్వారా గ్యాస్ కనెక్షన్‌కు రేషన్ కార్డు, ఆధార్ కార్డులను అనుసంధానం చేసుకోవాలన్నారు. గ్యాస్ ఏజెన్సీల దగ్గర ఈకేవైసీ ఖచ్చితంగా చేసుకోవాలన్నారు. ఈ పథకంపై సందేహాలను 1967 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఆధార్ లింక్ కలిగిన బ్యాంకు ఖాతాలో 24 గంటల నుంచి 48 గంటలలోపు నగదు జమ అవుతుందన్నారు. కర్నూలు జిల్లాలో 4,72,851 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు 77,353 మంది సిలిండర్లు బుక్ చేసుకున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు సిలిండర్లను ఇళ్లలో మాత్రమే వినియోగించుకోవాలన్నారు. కమర్షియల్‌గా వినియోగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘువీరా తదితరులు పాల్గొన్నారు

'అపార్' పూర్తి చేయండి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 31వ తేదీ నాటికి విద్యార్థుల అపార్ ఐడీ కార్డులు వందశాతం నమోదు పూర్తి కావాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి హౌసింగ్, ఉపాధి హామీ, పీజీఆర్ఎస్, రీసర్వే, అపార్ ఐడీ కార్డులు తదితర అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్ మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వేకి సంబంధించి గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం అమలులో జిల్లా వెనుకబడి ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీని ఆదేశించారు. పెద్దకడుబూరు, ఆదోని మండలాల్లో కనీసం రోజుకు 100 మందికి కూడా పని దినాలు కల్పించలేదని, సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, జడ్పీసీఈవో నాసరరెడ్డి, డీఈవో శ్యామ్యూల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

కర్నూలు లీగల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల డిసెంబరు 14వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది సూచించారు. స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో గురువారం స్థానిక పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులకు ఎలాంటి ఖర్చులు లేకుండా సత్వర న్యాయం అందించేందుకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని కోర్టులలో ఈ జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులందరూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో చురుకుగా పాల్గొని రాజకీయ అర్హత కలిగి ఉన్న క్రిమినల్ కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కారమయ్యేందుకు సహకరించాలని ఆయన పోలీసు అధికారులను కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మున్సిపల్, భూసేకరణ కేసులతో పాటు అన్ని సివిల్ కేసులను, ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం. వెంకట హరినాథ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ. లీలా వెంకట శేషాద్రి, పెద్ద సంఖ్యలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది

20 నుంచి జీడీపీ నీరు విడుదల



గాజులదిన్నె ప్రాజెక్టు

రబీ సాగుకు గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు రైతులు సిద్ధమవుతున్నారు. అధికారులు నవంబరు నెల 15 నుంచి 20 లోపు సాగునీటిని విడుదల చేస్తామని అంటున్నారు. ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని చెబుతున్నారు. ఇప్పటికే రబీ సీజన్ అక్టోబరు 1 ప్రారంభమైంది. నెల రోజులు పూర్తయినా ఆయకట్టు రైతులకు సాగు నీరు అందలేదు. రబీ సాగులో ఒకనెల రోజులు వృథా అయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీడీఆర్‌సీ సమావేశంలో నవంబరు 20 వ తేదీ లోపు ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.


6లో

అభ్యంతరాలు తెలియజేయండి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, ఖాళీ పోస్టులకు సంబంధించి ధ్రువపత్రాల పరిశీలన గురువారంతో పూర్తయింది. ఇందుకు సంబంధించి అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును Https://rvmssakurnool.blogspot.com వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో శ్యామ్యూల్ పాల్ వెల్లడించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. అభ్యంతరాలుంటే సరైన ఆధారాలతో సమగ్రశిక్ష కార్యాలయంలో 8, 9 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలలోపు హాజరై వారి లిస్టును సరి చేయించుకోవాలని తెలిపారు.

రైతుల కష్టాలు...!

- నవంబరు 15 వరకు రెవెన్యూ గ్రామసభలు
- జగనన్న భూసర్వేలో అనేక తప్పిదాలు
- 16,280 మంది రైతుల దరఖాస్తులు
- సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- సర్వే అధికారుల పర్యవేక్షణ కరువు



కర్నూలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రధానంగా ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ సమస్యలపై రైతుల నుంచి అత్యధికంగా వినతులు వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జగనన్న భూసర్వే ప్రతి గ్రామంలో తప్పులతడకగా సర్వే చేశారు. రైతులు వారి వంశపారంపర్యం నుంచి తరతరాలుగా వస్తున్న భూమిని సాగు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో రైతుల భూముల కబ్జాలు, సర్వేలోని తప్పిదాలు, జాయింట్ అకౌంట్లు, సర్వే నెంబర్ల తారుమారు వంటివి జరిగాయి. రైతుల భూసమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం గత నెల 8వ తేదీ నుంచి నవంబరు 15 వరకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తోంది. గ్రామ సభల ద్వారా రైతుల నుంచి భూసమస్యలపై రెవెన్యూ అధికారులు అర్జీలను స్వీకరిస్తున్నారు. అర్జీలు తీసుకున్న తర్వాత మండల రెవెన్యూ అధికారులు ఎన్ని రోజుల్లో పరిష్కారం చేసేదీ రైతులకు చెప్పడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామ రెవెన్యూ సభలో గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, కొన్ని గ్రామ ప్రాంతాల్లో రైతులు దరఖాస్తుల సందేహాలను నివృత్తి చేయడం లేదు. దీంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

పర్యవేక్షణ, తనిఖీ చేయని అధికారులు

కర్నూలు డివిజన్‌లో 70 గ్రామాల్లో గ్రామసభలు ద్వారా రైతులు తమ భూసమస్యల పరిష్కారం కోసం 5506 మంది ఆదోని డివిజన్‌లో 114 గ్రామాల్లో 5494 మంది, పత్తికొండ డివిజన్‌లో 50 గ్రామాలలో 5280 మంది దరఖాస్తులు చేసుకున్నారు. కర్నూలు జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. ప్రస్తుతం ప్రతి రెవెన్యూ డివిజన్‌లో గ్రామ రెవెన్యూ సదస్సు జరుగుతోంది. రెవెన్యూ సదస్సులను ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఉన్నతాధికారులు పర్యవేక్షించడం లేదని విమర్శలున్నాయి. గ్రామ రెవెన్యూ సదస్సులు కేవలం మమ అనిపించేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

జాయింట్ అకౌంట్‌తో అవస్థలు

రీసర్వే జరిగిన గ్రామాల్లో ఒకే సర్వేలో అన్నదమ్ములకు జాయింట్ అకౌంటు ఇచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామ రెవెన్యూ సదస్సులో రైతుల జాయింట్ అకౌంటులపై అత్యధికంగా ఫిర్యాదులు వచ్చాయి. జాయింట్ అకౌంట్లను వేరు చేయాలని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో కొందరు వీఆర్వోలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. భవిష్యత్తులో ఒకే సర్వేలో జాయింట్ నెంబర్ నమోదు కావడం వల్ల అమ్మడం కానీ, కొనడం గానీ జరిగితే ఆ సర్వేలో ఉన్న రైతులు అనేక ఇబ్బందులకు గురవుతారు. ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు ఆర్డీవో, తహసీల్దార్, మండల సర్వేయరు, గ్రామ సర్వేయర్లను కోరుతున్నారు.

టీడీపీ నాయకుడి దౌర్జన్యాలు అరికట్టండి

- ఆళ్లగడ్డ చికెన్ వ్యాపారుల ఆవేదన
- ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు



ఫిర్యాదు కాపీని చూపుతున్న బాధితులు

నంద్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమ వ్యాపారాలకు అడ్డు తగులుతూ వేధింపులకు గురి చేస్తున్న ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి దౌర్జన్యాలను అరికట్టాలంటూ చికెన్ సెంటర్ల వ్యాపారులు గురువారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చికెన్ వ్యాపారి హుసేన్ బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకుల వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. ముఖ్యంగా ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అనుచరుడు హర్షవర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి చికెన్ వ్యాపారం చేసుకోవాలంటే తన వద్దనే సరుకు తీసుకోవాలని లేకపోతే కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరింపులకు గురి చేస్తున్నాడన్నారు. దీనికి తోడు మున్సిపల్ కమిషనర్ ద్వారా తమ చికెన్ దుకాణాన్ని మూసివేయించారని, గతంలో కూడా హర్షవర్ధన్‌రెడ్డి తమ వారికి చెందిన భూమిని కబ్జా చేసేందుకు యత్నించాడన్నారు. అతడి వల్ల తమకు ప్రాణహాని ఉందని, వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

పారాలో పతకాలు

స్ఫూర్తి



రోయింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుడు నారాయణ

- అంతర్జాతీయ పారా రోయింగ్‌లో రాణిస్తున్న ప్యాపిలి యువకుడు
- ప్రధాని నుంచి ప్రసంశలు అందుకున్న నారాయణ

ప్యాపిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పారా రోయింగ్ పోటీల్లో ప్యాపిలి క్రీడాకారుడు రాణిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొని పతకాల పంటను పండిస్తున్నారు. ఇటీవల జరిగిన పారా ఒలింపిక్స్ పోటీల్లో పాల్గొన్న యువకుడు నారాయణ ప్రధాని మోదీచే ప్రసంశలు పొందాడు.

ప్యాపిలి పట్టణానికి చెందిన కొంగనపల్లి వెంకటస్వామి, సుంకమ్మ దంపతుల రెండో కుమారుడు కొంగనపల్లి నారాయణ. వీరిది వ్యవసాయ కుంటుంబం. ఆర్థిక ఇబ్బందులతో తల్లిదండ్రులు పిల్లలను చదివించడానికి ఇష్టపడలేదు. అయితే ఆర్మీలో చేరి దేశానికి తనవంతు సేవలందించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్న నారాయణ తల్లిదండ్రులను, అన్నను ఒప్పించి ఇంటర్ వరకు చదివాడు. ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థిక స్థోమతలేక మధ్యలోనే చదువు ఆపేశాడు.

తొలి ప్రయత్నంలోనే ఆర్మీలో ఉద్యోగం

ఇంటర్మీడియట్‌ను 2005-06లో పూర్తి చేసిన కొంగనపల్లి నారాయణ 2008లో తొలి ప్రయత్నంలోనే ఆర్మీలో ఉద్యోగం సాధించి తన లక్ష్యాన్ని సాధించాడు. రెండేళ్ల పాటు బెంగుళూరులో ఆర్మీలో శిక్షణ తీసుకున్న యువకుడు మొదటిసారి సికింద్రాబాదులో విధుల్లో చేరారు. అనంతరం దేశంలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించి అధికారుల ప్రసంశలు పొందాడు.

విధి నిర్వహణలో కాలు కోల్పోయిన నారాయణ

2015 సంవత్సరంలో జమ్మూ కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో శత్రుదేశం ఏర్పాటు చేసిన మందుపాతర పేలడంతో నారాయణ కాలు పూర్తిగా దెబ్బతిన్నది. దాదాపు 5నెలల పాటు వైద్యం చికిత్సలు చేసిన గాయం నయం కాలేదు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వైద్యులు నారాయణ కుడి కాలు పాదాన్ని తీసివేశారు. దీంతో యువకుడు నారాయణ పుణేలో కృత్రిమ పాదాన్ని అమర్చుకున్నాడు.

పారా రోయింగ్ క్రీడపై దృష్టి

పాదం కోల్పోవడంతో మానసికంగా కృంగిపోతున్న నారాయణను చూసి చలించిన ఆర్మీ ఉన్నతాధికారి రోయింగ్ క్రీడపై అవగాహన కల్పించారు. ఈ క్రీడ వలన ప్రపంచస్థాయి గుర్తింపు పొందవచ్చని నారాయణకు ఆత్మస్థైర్యాన్ని నింపారు. దీంతో నారాయణ అధికారి సూచన మేరకు రోయింగ్ క్రీడపై ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో..



రోయింగ్ శిక్షణ పూర్తి చేసిన నారాయణ మొదటిసారి 2017లో రాష్ట్రస్థాయి రోయింగ్ పోటీల్లో పాల్గొని విజయం సాధించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని విజయాల పరంపర కొనసాగించారు. ఆయా పోటీల్లో దాదాపు 30 పతకాలు సాధించారు. దీంతో పారారోయింగ్‌లో నారాయణ ప్రతిభను ఆర్మీ ఉన్నతాధికారులు ప్రసంశించారు.

పతకం రాకపోయినా...

ఇటీవల పారిస్‌లో జరిగిన పారా రోయింగ్ పోటీల్లో నారాయణ మన దేశం తరఫున పాల్గొన్నారు. ప్రపంచంలోని రోయింగ్ క్రీడల్లో పోలెండ్, దక్షిణ కొరియా, హంకాంగ్ తదితర దేశాలతో ఒలింపిక్స్‌లో తలపడ్డాడు. అయితే పోటీల్లో 8వ స్థానంలో నిలిచిన నారాయణకు ఒలింపిక్స్‌లో ఏ పతకం అందకపోవడంతో నిరాశ చెందాడు. భారత్ తరఫున ఒలింపిక్స్‌లో పాల్గొన్న నారాయణను ఢిల్లీలో ప్రధాని మోదీ అభినందించడం విశేషం. ఒలింపిక్స్‌లో పతకం రాకపోయినా తన రోయింగ్ క్రీడను కొనసాగిస్తానని నారాయణ తెలిపారు.



ప్రధాని మోదీతో నారాయణ

పత్తికొండలో సబ్ కోర్టు ఏర్పాటు చేయాలి



మంత్రి ఫరూక్‌ను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు, టీడీపీ నాయకులు

నంద్యాల రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పత్తికొండలో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. గురువారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పత్తికొండలో సబ్‌కోర్టు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు, ప్రభుత్వ శాఖలకు కలిగే ప్రయోజనాల గురించి మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, న్యాయవాదులు ఉన్నారు.

దేవదాయ శాఖ సూపరింటెండెంట్‌పై కేసు నమోదు

కర్నూలు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు దేవదాయ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనివాసరెడ్డి సూపరింటెండెంట్‌గా పని చేస్తూ రూ.2 కోట్లకు పైగా నిధులు తన ఖాతాలోకి మళ్లించుకున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారాన్ని విచారించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని ఆయన పోలీసు అధికారులను కోరారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

20 నుంచి జీడీపీ నీటి విడుదల

- జలాశయంలో 2.2 టీఎంసీల నీరు మాత్రమే..
- వేసవిలో తాగునీటి పథకాలకు ఇబ్బంది లేదు
- హంద్రీనీవా నీరు తీసుకురావాలి - రైతుల డిమాండ్



పంటలకు సాగు నీరు అందించేందుకు సిద్ధంగా ఉన్న కుడి, ఎడమ కాలువలు



ఆయకట్టు రైతులు సాగుకు సిద్ధం చేసుకున్న భూమి

గోనెగండ్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టులో 2.2 టీఎంసీ నీరు నిలువ ఉంది. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీలు. అయితే గత ఏడాది నుంచి ప్రాజెక్టు కట్ట ఎత్తు పెంచేందుకు పనులు ప్రారంభమయ్యాయి. దీంతో గత ఏడాది అధికారులు ఆయకట్టు రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈ ఏడాది తప్పని సరిగా పంటలకు నీరు విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. జీడీపీ కింద ఆయకట్టు 24వేల ఎకరాలు ఉంది. కాగా ప్రతి ఏడాది కుడి, ఎడమ కాలువల కింద 13వేల ఎకరాలకు మించి సాగు కావడంలేదు. ఈ ఏడాది కూడా అంతే సాగు అవుతుందని రైతులు తెలుపుతున్నారు.

డీడీఆర్‌సీ సమావేశంలో అసలు విషయం

గత ఏడాది ప్రాజెక్టు మరమ్మతు పనులు, అలాగే ప్రాజెక్టులో కేవలం 0.52 టీఎంసీ నీరు ఉన్న కారణంగా అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించారు. దీంతో రైతులు తమ భూములను బీడు భూములుగా మార్చుకోవాల్సి వచ్చింది. కాని ఈ ఏడాది ప్రాజెక్టులో 2.2 టీఎంసీ నీరు నిలువ ఉంది కాబట్టి ఈ ఏడాది ఎలాగైన రబీలో పంటలకు సాగునీరు ఇవ్వలని రైతులు కోరారు. డీడీఆర్‌సీ సమావేశం జరగడంతో అడ్డంకి తొలగి నీరు ఇవ్వడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు ఆయకట్టు రైతులతో జీడీపీ అధికారులు సమావేశం ఏర్పాటు చేసి ఎన్ని వేల ఎకరాలకు ఎప్పటి నుంచి నీరు ఇచ్చేంది ప్రకటించనున్నారు.

హంద్రీనీవా నీరు తీసుకురావాలి

ఈ ఏడాది రబీసాగుకు ప్రాజెక్టులో నీరు సరిపోక పోతే హంద్రీనీవా నుంచి 3 టీఎంసీల నీరు మళ్లించి ప్రాజెక్టులో నిలువ చేసి ఆయకట్టు రైతుల పంటలకు తగినన్ని నీరు అందించాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో నాయకులు, అధికారుల హంద్రీ నీవా నీరు ప్రాజెక్టుకు మళ్లించిన సంఘటలు ఉన్నాయి. కాబట్టి నీటిని మళ్లించి తీసుకువచ్చి రైతుకు అందిస్తారని ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రబీ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాలకు సిద్ధమవుతున్నారు.

తాగునీటి పథకాలకు ఇబ్బంది లేదు:

జీడీపీ కింద జీన్, క్రిష్ణగిరి, బండగట్టు, కోడుమూరు, కర్నూలు, గూడురు తదితర ప్రాంతాలతో పాటు ఎమ్మిగనూరు ప్రాంతానికి కూడా కొత్తగా నీటి పథకం కింద నీరు ఇవ్వాలి. అయితే ప్రాజెక్టులో 2.2 టీఎంసీ నీరు ఉంది. 13 వేల ఎకరాలు సాగు అయితే సాగుకు గాను 1.3 టీఎంసీ నీరు పోతే మిగతా నీటితో తాగునీటి పథకాలకు ఇబ్బంది ఉండదు. దీనికి తోడు నీరు హంద్రీనీవా నుంచి విడుదల అయ్యే అవకాశం ఉండటంతో వచ్చే వేసవిలో తాగునీటి పథకాలకు నీటి ఇబ్బంది ఉండదు.

పంటలు చేతికి అందే వరకు నీరు విడుదల చేయాలి



గత ఏడాది ప్రాజెక్టులో నీరు లేని కారణంగా పొలాలు బీడు భూములుగా మారిపోయాయి. ఈ ఏడాదైనా పంటలు చేతికి అందేవరకు అధికారులు మార్చి నెల ఆఖరు వరకు నీరు విడుదల చేయాలి. అధికారులు ఇష్టం వచ్చినట్లు చేస్తామంటే ఒప్పుకునేది లేదు. హంద్రీనీవా నీటిని తప్పని సరిగా తీసుకువచ్చి సాగు, తాగునీటి సమస్య లేకుండా చూడాలి.

-కేవీ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ, జీడీపీ సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు

రబీలో సాగు నీరు విడుదల చేస్తాం

జీడీపీ కింద ఎన్ని వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలో అధికారులు నిర్ణయిస్తారు. ఆ ప్రకారంగా నవంబరు నెల 15 నుంచి 20 వ తేదీలోపు ఆయకట్టు రైతులకు సాగు నీరు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేసుకోవాలి. ప్రాజెక్ట్‌లో 2.2 టీఎంసీ నీరు ఉంది. కాబట్టి సాగు నీటి విడుదలకు ఇబ్బంది లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీరు విడుదల చేస్తాం.

-విజయ్‌కుమార్, జీడీపీ డీఈ

రాయలసీమ వర్సిటీలో దాహం కేకలు..!

(5వ పేజీ తరువాయి)

కర్నూలు కార్పొరేషన్ అధికారులు యూనివర్సిటీకి తాగునీటి పైపులైన్ వేసినా రెండు మూడు నెలలు మాత్రమే నీటిని విడుదల చేశారు. ఆ తరువాత పైపులను క్లోజ్ చేశారు. అప్పటి నుంచి ఎనిమిదేళ్లుగా వర్సిటీలో నీటి సమస్య జఠిలమైంది. కార్పొరేషన్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం శూన్యం. తాగునీరు మాత్రం ఇవ్వడం లేదు. అదే సమయంలో బోర్లు కూడా పని చేయడం లేదు. దీంతో విద్యార్థుల అవసరాల కోసం రోజుకు బాలికల హాస్టల్‌కు 30 ట్యాంకులు, బాలుర హాస్టల్‌కు 25-30 ట్యాంకులు ఒక్కో ట్యాంకు రూ.320 ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. అలాగే.. తాగడానికి ఆర్‌వో వాటర్ వ్యాన్ల నీటి కోసం రూ.5.500 ఖర్చు చేస్తున్నారు. దినసరి అవసరాలకు కోసం, తాగునీటి కోసం రోజుకు సరాసరి రూ.21 వేలు చొపున నెలకు రూ.6.30 లక్షలు, ఏడాదికి రూ.75 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు. కార్పొరేషన్ నీటిని సరఫరా చేస్తే దాదాపు సగానికి పైగా ఖర్చు తగ్గడమే కాకుండా శుద్ధి చేసిన స్వచ్ఛమైన తుంగభద్ర జలాలు అందుతాయి. నగరపాలక సంస్థ నుంచి నీటి సరఫరా చేయకపోవడంతో రూ.లక్షలు ప్రజాధనం వెచ్చించి ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, జిల్లా యంత్రాంగం స్పందించి కార్పొరేషన్ ద్వారా నీటిని సరఫరా చేసి రాయలసీమ యూనివర్సిటీలో విద్యార్థుల దాహం తీర్చాలని పలువురు కోరుతున్నారు.



నీటి సమస్య వాస్తవమే

యూనివర్సిటీలో నీటి సమస్య వాస్తవమే. విద్యార్థుల రోజువారి అవసరాలు తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా, తాగునీటి కోసం ఆర్‌వో వాటర్ కొనుగోలు చేస్తున్నాం. రోజుకు దాదాపుగా రూ.20 వేలు ఖర్చు చేస్తున్నాం. ఒకబోరు రిపేరి చేయించడం వల్ల కొంతవరకు ఆదా చేయగలిగాం. కర్నూలు కార్పొరేషన్ నుంచి శుద్ధి చేసిన నీటిని సరఫరా కోసం పైపులైన్ ఉన్నా.. నీళ్లు రావడం లేదు. 2016లో నీటి కోసం కార్పొరేషన్‌కు రూ.81.68 లక్షలు చెల్లించాం.

-ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్, రాయలసీమ వర్సిటీ, కర్నూలు

రేడియాలజీ.. ఓ అద్భుతం...

- ఎక్స్‌రే నుంచి ఎంఆర్ఐ వరకు
- 'ఎక్స్' కిరణాల ఆవిష్కరణతో విప్లవాత్మక మార్పులు
- నేడు వరల్డ్ రేడియాలజీ డే



కర్నూలు హాస్పిటల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గుండె రక్తనాళాల్లో పూడికలు గుర్తించాలంటే యాంజియోగ్రామ్ చేసేవారు. ఇప్పుడు ఆసుపత్రిలో అడ్మిషన్ అవసరం లేకుండా సిటీ స్కాన్ అందుబాటులో వచ్చింది. ప్రారంభంలో సింగిల్ స్కాన్‌లు ఉండేవి. డ్యూయల్ 4, 8, 16, స్లయస్ నుంచి ప్రస్తుతం 250, 320, స్లయస్ సిటీ స్కాన్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. గుండె, కిడ్నీ, మెదడు, లివర్ వ్యాధులతో పాటు రక్తనాళాల్లోని లోపాలను గుర్తించే అత్యాధునిక సిటీ స్కాన్‌లు జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కడా లేని విధంగా కర్నూలు జీజీహెచ్ రేడియాలజీ విభాగంలో ఈ విధానాలు ప్రొసిజర్స్ అందుబాటులో ఉన్నాయి.

> రేడియాలజీ ఆవిష్కరణ తర్వాత వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. మానవ, జంతువుల శరీరాలను ప్రభావితం చేసే పరిస్థితులను గుర్తించడానికి, చికిత్స చేయడానికి ఇమేజింగ్ సాంకేతికతను ఉపయోగించే వైద్యరంగంలో, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో రేడియాలజీకి అద్భుతమైన పాత్ర ఉంది. 1895లో జర్మనీకి చెందిన ప్రొఫెసర్ రాంట్‌జన్ అనుకోకుండా ఎక్స్‌రే కిరణాలను కనుగొన్నారు. ఆయన పుట్టిన రోజు నవంబరు 8న వరల్డ్ రేడియాలజీ డేను నిర్వహించడం ఆనవాయితీ. 2024న రేడియో గ్రాఫర్స్ సీయింగ్ ది అన్‌సీన్ అన్న నినాదాన్ని ఇచ్చారు.

కర్నూలు జీజీహెచ్‌లో రికార్డు స్థాయిలో సేవలు

కర్నూలు జీజీహెచ్‌లో రేడియాలజీ విభాగం 1958లో ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 20 మంది పీజీలు ఉన్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు పక్కనున్న తెలంగాణ గద్వాల జిల్లా, వనపర్తి జిల్లాలకు చెందిన ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. ప్రతి నెల ఎక్స్‌రేలు 10వేల మందికి గాను 30 వేల ఎక్స్‌రేలు, అల్ట్రాసౌండ్ పరీక్షలు నెలకు 10వేలు, సిటీ స్కాన్‌లు నెలకు 4622, ఎంఆర్ఐ నెలకు 1825, బయాప్సీ పరీక్షలు 120 దాకా చేస్తుంటారు. ఈ విభాగంలో డైరెక్టు డిజిటల్ రేడియోగ్రఫీ మిషన్‌తో పాటు 500 ఎంఏ యంత్రాలు నాలుగు, 300 ఎంఏ 2, పోర్టబుల్ మిషన్లు 12 ఉన్నాయి. ఇక మాగ్నటిక్ రిసోర్సెస్ ఇమేజింగ్ (ఎంఆర్ఐ) స్కాన్ కర్నూలు జీజీహెచ్‌లో 15 టెస్లా, సిటీ స్కాన్ 16 స్లైయిస్ అందుబాటులో ఉంది.

రేడియాలజిస్టుల పాత్ర కీలకం



గర్భంలో ఉన్న శిశువు ఆరోగ్యం నుంచి వృద్ధాప్యంలో వచ్చే వ్యాధుల వరకు నిర్ధారణలో రేడియాలజిస్టుల పాత్ర ఎంతో కీలకం. ఎక్స్‌రే నుంచి డిజిటల్ ఎక్స్‌రే, సిటీ, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ స్కాన్లు వరకు ఇంటర్వేన్షనల్ రేడియాలజీ సేవలు వైద్యరంగంలో ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. ప్రతి నెల 30వేల ఎక్స్‌రేలు, 10వేల అల్ట్రాసౌండ్, 4622 సిటీ, ఎంఆర్ఐ, 1825 వరకు ప్రతి నెల నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా రేడియాలజీతో పాటు ఇంటర్వేన్షనల్ రేడియాలజీ ప్రొసీజెస్ నిర్వహిస్తున్నాం.

- డా.కే. రాధారాణి, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, రేడియాలజీ విభాగం, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

ఇంటర్వెన్షనల్ రేడియాలజీ ఓ ప్రత్యేకం

రేడియాలజీ విభాగంలో ఓ ప్రత్యేక రంగం ఇంటర్వెన్షనల్ రేడియాలజీ. ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్టు గా డా. బి.అరుణ్ కుమార్ కర్నూలు జీజీహెచ్‌లో సేవలు అందిస్తున్నారు. ఆపరేషన్, కోత లేకుండా రక్తనాళాల ద్వారా మందులు ఇచ్చే ఈ ప్రక్రియలో డా.అరుణ్ కుమార్ ఎన్నో ప్రొసిజర్స్ నిర్వహించారు.



కర్నూలు జీజీహెచ్‌లోని రేడియాలజీ విభాగం

రేడియాలజీ గుండెలాంటిది



వైద్యరంగంలో రేడియాలజీ విభాగం గుండె కాయలాంటిది. క్యాన్సర్, పగుళ్లు, ఇన్‌ఫెక్షన్‌ల వంటి పరిస్థితులను ముందుగానే గుర్తించడానికి రేడియాలజీ ఎంతో ఉపయోగపడుతుంది. అదేవిధంగా ఛాతి 'ఎక్స్' కిరణాలు న్యూమోనియా లేదా ఊపిరితిత్తుల వ్యాధుల తీవ్రతను గుర్తించడంలో సహాయపడతాయి. ఆసుపత్రిలో డయాగ్నోస్టిక్‌తో పాటు ఇంటర్వెన్షనల్ రేడియాలజీలో ఆరోగ్యశ్రీ ద్వారా ఖరీదైన పరీక్షలు, చికిత్స అందిస్తున్నాం.

-డా.డి. హరినాథ్, అసోసియేట్ ప్రొఫెసర్, రేడియాలజీ విభాగం, కర్నూలు జీజీహెచ్



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు



వైసీపీ నేతల కబ్జాలు నిరూపిస్తాం

- ఎక్కడ గొడవలు జరిగినా మంత్రిపై నెపమా..?
- నిరాధార ఆరోపణలు చేస్తే కేసులు పెడతాం
- మండిపడిన కార్పొరేటర్లు

కర్నూలు అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు భూకబ్జాలు నిరూపిస్తామని టీడీపీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు అన్నారు. గురువారం నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 23వ వార్డు వైసీపీ కార్పొరేటర్ కటారు పల్లవి, ఆమె భర్త కటారీ సురేష్ భూకబ్జాల గురించి తమవద్ద అన్ని సాక్ష్యాలున్నాయని, వాటిని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నగరంలో ఎక్కడ గొడవలు జరిగినా మంత్రి టీజీ భరత్‌పై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని వారు మండిపడ్డారు. వైసీపీ కార్పొరేటర్లు తప్పుడు ప్రచారాలు చేస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. శ్రీరామ్‌నగరలో నిరుద్యోగ ఉపాధి కోసం బంకులు వేసుకుంటే చిన్నారులు, మహిళల పేర్లు చెప్పుకుని వైసీపీ నాయకులు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్లలో వైసీపీ నాయకులు చేసిన కబ్జాలన్నింటిపై తమవద్ద సాక్ష్యాలున్నాయని టీడీపీ కార్పొరేటర్లు తెలిపారు. నగర అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత మేయర్ బీవై రామయ్యకు లేదన్నారు. కార్పొరేటర్లు పరమేష్, క్రాంతి కుమార్, పరాజ్ ఖాన్, జకియా అక్సారీ, విజయకుమారి, కైపా పద్మలత, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్ పాల్గొన్నారు.

యురేనియం తవ్వకాలు తక్షణమే ఆపాలి



సదస్సులో మాట్లాడుతున్న రవీంద్రశర్మ

- ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దేవనకొండ మండలం చుట్టుపక్కల గ్రామాలలో యురేనియం తవ్వకాలు తక్షణమే ఆపాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో గురువారం సీపీఐ కార్యాలయంలో నగర కార్యదర్శి పి. రామక్రిష్ణారెడ్డి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బి. రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ యురేనియాన్ని భూమిలోంచి వెలికి తీస్తే చుట్టుపక్కల దాదాపు 100 కి.మీ మేర దాని ప్రభావం ఉంటుందన్నారు.

కప్పట్రాళ్లకు చెందిన యురేనియం తవ్వకాల వ్యతిరేక ఉద్యమకారుడు రవీంద్రశర్మ మాట్లాడుతూ తమ గ్రామం వద్ద యురేనియం తవ్వకాలకు 68 బోర్లు వేసుకునేందుకు అటవీ శాఖ అనుమతి ఇచ్చిందని అన్నారు. అన్ని పార్టీలు ఏకమై ఈ తవ్వకాల ఉత్త ర్వులు రద్దు చేసే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 11న కలెక్టరేట్ ఎదుట యురేనియం తవ్వకాలపై పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సదస్సులో తీర్మానించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి నాగన్న, రాయలసీమ విద్యావంతుల వేదిక కో కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి అల్లాబకాష్ యురేనియం తవ్వకాలను వ్యతిరేకిస్తూ ప్రసంగించారు.

స్పష్టమైన ఎండార్స్‌మెంట్ ఇవ్వండి



- డీఆర్వో వెంకటనారాయణమ్మ

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే అర్జీలకు స్పష్టమైన ఎండార్స్‌మెంటు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ - పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలకు సరైన ఎండార్స్ మెంటు ఇచ్చేలా అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్‌కు వచ్చిన దరఖా స్తులను పరిష్కారంలో అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌లో నాణ్యతను పెంచడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌కు ఇచ్చే ఎండార్స్‌మెంట్ ఆఖరి క్షణంలో వస్తోం దని, అలా కాకుండా అర్జీ పరిష్కారం కోసం 30 రోజుల సమయం ఉంటుంది కాబట్టి పది రోజులకు ముందే ఎంక్వైరీ రిపోర్టు ఎండార్స్ మెంటును డీఆర్వోకు అందజేయాలన్నారు. రానున్న రోజుల్లో గ్రీవెన్స్ పరిష్కరించే అధికా రులకు అందరికీ లాగిన్స్ ఇస్తారని అన్నారు. పీజీఆర్ఎస్ నోడల్ ఆఫీసర్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్న లక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి చేరిన అమ్మ



గుంతకల్లులో కొడుకు ఇంటికి చేరిన వృద్ధురాలు తిరుపతమ్మ

- ఈనెల 1న అర్ధరాత్రి రోడ్డుపై వదిలేసి వెళ్లిన కొడుకు
- కొడుకు, కూతుళ్లకు కౌన్సెలింగ్
- సీనియర్ సిటిజన్ యాక్టు కింద కేసు నమోదు
- మరో అవకాశం ఇచ్చిన ఆర్డీవో
- ఎట్టకేలకు ఇంటికి చేరుకున్న వృద్ధురాలు తిరుపతమ్మ

పత్తికొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వీధిపాలైన ఆ తల్లి ఎట్టకేలకు గూటికి చేరుకుంది. కన్న కొడుకు నిర్దాక్షిణ్యంగా అర్ధరాత్రి నడిరోడ్డుపై వదిలేసి వెళ్లాడు. వృద్ధాప్యంలో తల్లిని చంటి పాపలా చూసుకోవాల్సిన కొడుకులకు, కూతుళ్లకు ఆమె భారమైంది. తల్లిని, ఆమె ఆత్మగౌరవాన్ని వీధిలోకి విసిరేసిన సంతానం మీద సీఐ సీనియర్ సిటిజన్ ప్రొటెక్షన్ యాక్ట్ కింద సుమోటోగా కేసు నమోదు చేశాడు.

ఆత్మీయంగా, బాధ్యతాయుతంగా ఉండాల్సిన తల్లీబిడ్డల సంబంధాల్లో పిల్లల అమానవీయ ధోరణిని చివరికి చట్టం సరి చేయాల్సి వచ్చింది. ఈ నెల ఒకటో తేదీ వీధిపాలైన తిరుపతమ్మ కేసు ఎట్టకేలకు 6 రోజుల తర్వాత పరిష్కారమైంది. గురువారం రాత్రి గుంతకల్‌లోని కొడుకు శ్రీనివా సులు ఇంటికి చేరింది. పత్తికొండ సీఐ జయన్న తిరుపతమ్మను పత్తికొండ ఆసుపత్రిలో చేర్పించి కొడుకు శ్రీనివాసులుతోపాటు కుమార్తెలను స్టేషన్‌కు పిలిచి విచారించారు. రెండుసార్లు కౌన్సిలింగ్ ఇచ్చారు. తల్లి బాధ్యతను తీసుకునేందుకు బిడ్డలు ముం దుకు రాకపోవడంతో వారిపై ఆర్డీవో భరత్‌నాయక్ 3రోజులు గడువు ఇచ్చి, అప్పటికీ మార్పు లేకపోతే చట్టపరచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తల్లి బాధ్యత తీసుకున్న కొడుకు, అండగా నిలిచిన కూతుళ్లు

ఆర్డీవో కౌన్సిలింగ్ తర్వాత తల్లి బాధ్యత తీసుకోడానికి కొడుకు, కూతుళ్లు ముందుకు వచ్చారు. ఆమెను కడదాకా చూసు కుంటానని కొడుకు అన్నాడు. తల్లి వైద్యం కోసం నెలనెల ఖర్చులు భరిస్తామని కూతుళ్లు ముందుకు వచ్చారు. ఈ విషయాలను సీఐ వారి నుంచి రాతపూర్వకంగా తీసుకుని సంతకాలు తీసుకున్నారు. సీఐ పత్తికొండ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి తిరుపతమ్మను దగ్గరుండి డిశ్చార్జ్ చేయించి రాత్రి 7.30 గంటలకు కొడుకు, కోడలుకు అప్పగించి వారితో గుంతకల్ పంపించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం: కోట్ల



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

వెల్దుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అధైర్యపడొద్దు, అండగా ఉంటామని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఇటీవల మృతిచెందిన టీడీపీ నాయకుడు బొమ్మన శివశంకర్‌రెడ్డి కుమారుడు బొమ్మన రమాకాంత్‌రెడ్డిని పరామర్శించారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బలరాంగౌడు, రామకృష్ణాచారి, రామకృష్ణ పాల్గొన్నారు

డీఎస్సీ శిక్షణకు 10న ఉచిత స్క్రీనింగ్ పరీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 3 నెలలు ఉచిత డీఎస్సీ (ఎస్‌జీటీ, ఎస్‌ఏ)ల శిక్షణ స్క్రీనింగ్ పరీక్ష ఈ నెల 10వ తేదీన 7 కళాశాలల్లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 797 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, కోచింగ్ సెంటర్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఈ పరీక్షను జ్ఞానభూమి పోర్టల్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. తప్పనిసరిగా పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్ లేదా డ్రైవింగ్ లైసెన్సు, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో పరీక్షకు హాజరు కావాల న్నారు. పరీక్ష ప్రారంభ సమయానికి 30 నిమిషాల ముందు అభ్యర్థులు కేంద్రాలకు హాజరు కావాలన్నారు. ఈ పరీక్ష ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు ఉంటుందని, అభ్యర్థులు 9.15 గంటల నుంచి 10 గంటల మధ్య పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. 15 నిమిషాలు గ్రేస్ టైమ్ అటే ఉదయం 10.15 గంటల వరకు అనుమతి ఉంటుందని అన్నారు.

నెరవేరిన సీఎం హామీ

- పుచ్చకాయలమడలో ట్యాంకు పనులు ప్రారంభం



ట్యాంకు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

పత్తికొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుచ్చకాయలమడ గ్రామ పర్యటనలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం పుచ్చకాయలమడ గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజచేశారు. సీఎం హామీల నెరవేర్పులో ముందుగా ట్యాంకు నిర్మిస్తున్నామని త్వరలోనే మిగిలిన హామీలను పూర్తిచేస్తామన్నారు. సర్పంచ్ హరితారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు బత్తిన లోక్‌నాథ్, డీఎల్‌పీవో భద్రప్ప, ఇంచార్జి ఎంపీడీవో స్వర్ణలత, ఈవోఆర్డీ నరసింహులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సుందర్‌రాజు(ఫైల్)

నందవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పూలచింత క్రాస్ రోడ్డు దగ్గర సుందర్‌రాజు(42) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎమ్మిగనూరుకు చెందిన సుందర్‌రాజు గుజరి వ్యాపారం చేస్తు జీవనం సాగించేవాడు. రోజూ తెలంగాణలోని ఐజ ప్రాంతంలో గుజరి సామాన్లు తీసుకువచ్చి ఎమ్మిగనూరులో అమ్ముకునే వాడు. బుధవారం వెళ్లి రాత్రి ఐజ నుంచి వస్తుండగా పూలచింత క్రాస్ రోడ్డు దగ్గర గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. అతని దగ్గర ఉన్న ఆధార్, ఫోన్ నెంబర్‌ను గుర్తించి వారి బంధువులకు సమాచారం ఇవ్వగా వారు ఆటోలో ప్రమాదం జరిగిన ప్రదేశానికి వచ్చారు. తల పగిలి తీవ్ర రక్త గాయాలతో ఉన్న సుందరరాజును ఆటోలో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య మేరీ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శుభకార్యానికి వచ్చి...

కొలిమిగుండ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శుభ కార్యానికి వచ్చి ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మండలంలోని బెలుం గ్రామ సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం ద్వారకచర్ల గ్రామానికి చెందిన గురుప్రసాద్(25) స్నేహితుడి సోదరి వివాహ నిమిత్తం అవుకు మండలం రామాపురం గ్రామానికి గురువారం చేరుకున్నారు. వివాహం శుక్రవారం కావడంతో గురువారం సాయంత్రం నలుగురు మిత్రులతో కలిసి కారులో కొలిమిగుండ్ల మండలం బెలుం గుహల వద్దకు వచ్చాడు. తిరిగి రామాపురం వెళుతుండగా మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ కారును ఢీకొట్టింది. గురుప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అరవింద్ అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో పెళ్లింట విషాదం నెలకొంది. సీఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



శివ (ఫైల్)

కోసిగి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 4వ వార్డు కొత్తపేట కాలనీకి చెందిన కురువ రాముడు, నాగమ్మ దంపతుల కుమారుడు కురువ శివ(18) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన శివ గురువారం కోసిగి సమీపంలోని తమ పొలంలో ఉన్న రేకుల షెడ్డులో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని గురువారం ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామన్నారు.

ఫొటో స్టూడియో దగ్ధం

- రూ.10 లక్షల ఆస్తి నష్టం

మంత్రాలయం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగభద్రలో ఆర్లబండ కేఎం బాషాకు చెందిన ఫొటో స్టూడియో జిరాక్స్ మిషన్లు అగ్నికి దగ్ధమయ్యాయి. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. స్టూడియో యజమాని మధ్యాహ్నం సమయంలో తాళం వేసుకుని భోజనానికి ఇంటికి వెళ్లాడు. వచ్చి చూసే సరికి దుకాణంలో పొగలు, మంటలు వ్యాపించడం గమనించాడు. షాపులోని డిజిటల్ ఫొటో స్టూడియో, రెండు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్, నాలుగు డిజిటల్ కెమెరాలు, రెండు జిరాక్స్ మిషన్లు, ఫొటోలు, పది ఆల్బంలు కాలి బూడిదయ్యాయి. వీటి విలువ రూ.10లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. షార్ట్ సర్క్యూట్‌తో నష్టం జరిగిందని తెలిపారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

నంద్యాల క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో భర్త చిలంకూరు పుల్లయ్యకు 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టు న్యాయాధికారి జీవిత ఖైదు విధించినట్లు గురువారం పోలీసులు తెలిపారు. తన భార్య వేరే వ్యక్తితో చనువుగా ఉంటోందని దొర్నిపాడు మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో 2022 ఏప్రిల్ 8న చిలంకూరు పుల్లయ్య గొడ్డలితో నరికి చంపాడు. గోస్పాడు గ్రామానికి చెందిన పరదేశి బలదాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కోవెలకుంట్ల సీఐ డీవీ నారాయణరెడ్డి కేసు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు స్పీడ్ ట్రైల్ మానిటరింగ్ ద్వారా ఆళ్లగడ్డ డీఎస్పీ కె.రవికుమార్ పర్యవేక్షణలో ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరిరాముడు, దొర్నిపాడు ఎస్ఐ పి.వెంకటేష్ ఆధ్వర్యంలో దొర్నిపాడు పోలీసులు కోర్టులో సాక్ష్యాధారాలతో నిరూపించారు. దీంతో ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జికోర్టు న్యాయాధికారి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ చిలంకూరు పుల్లయ్యకు జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య




మహబూబ్‌బాషా మృతదేహం

ఆత్మకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతచెక్‌పోస్టు సమీపంలో నివాసం ఉంటున్న లారీ డ్రైవర్ మహబూబ్ బాషా (40) అనే వ్యక్తి అప్పులబాధ తాళలేక బుధవారం అర్ధరాత్రి దాటాక ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మకూరు మండలంలోని వడ్లరామా పురం గ్రామానికి చెందిన మహబూబ్‌బాషాకు 20ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం ఉన్నారు. మహబూబ్ భార్య 15ఏళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుంది. అయితే ఆరేళ్ల క్రితం మహబూబ్ బాషా నందికొట్కూరుకు చెందిన ఓ మహిళను వివాహం చేసుకున్నాడు. ఆమెకు కూడా ఇద్దరు సంతానం ఉన్నారు. కాగా ఆమె కూడా భర్తతో గొడవపడి రెండేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈక్రమంలోనే మహబూబ్ బాషా కొణిదేల గ్రామానికి చెందిన ఓ మహిళతో కలిసి ఆత్మకూరులోని పాత చెక్‌పోస్టు సమీపంలో నివాసం ఉంటున్నారు. మహబూబ్‌బాషా రూ.2 లక్షలు డౌన్ పేమెంట్ చెల్లించి కొత్త లారీ కొన్నాడు. ఈఎంఐలు చెల్లించలేక మరొక వ్యక్తికి లారీ ఇచ్చాడు. ఆయన కూడా ఈఎంఐలు చెల్లించలేక మహ బూబ్‌బాషాకే వెనక్కి ఇచ్చేశాడు. ఈఎంఐలు పెండింగ్ ఉండటంతో ఫైనాన్స్ సంస్థ లారీని సీజ్ చేసింది. దీంతో పూర్తిగా అప్పుల పాలైన మహబూబ్‌బాషా బుధవారం రాత్రి డబ్బులు ఇవ్వాలని సహజీవనం చేస్తున్న మహిళతో వాగ్వాదానికి దిగాడు. తర్వాత ఇరువురు నిద్రించారు. అయితే మహబూబ్ బాషా ఉరివేసుకున్నారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో ఆ మహిళ గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఏఎస్ఐ శంకరరెడ్డి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

బాలాజీ నగర్‌లో చైన్ స్నాచింగ్

కర్నూలు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో గురువారం చైన్ స్నాచింగ్ జరిగింది. సరస్వతమ్మ అనే మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును అపహరించారు. సరస్వతమ్మ గురువారం ఉదయం ఇంటి ముందు పూలు కోసుకుంటుం డగా.. ఇద్దరు అగంతకులు బైక్‌పై వచ్చి ఆమెను ఏదో సమాచారం అడిగారు. అర్థం గాక.. ఆమె వెనక్కి తిరిగేసరికి చటుక్కున ఆమె మెడలో నుంచి గొలుసు తెంపుకుని ఉడాయించారు. గొలుసు 2 తులాలు పైబడి ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చౌడేశ్వరీదేవి విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన చౌడేశ్వరీదేవి విగ్రహం

పాములపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మిట్టకందాల వెళ్లె రహదారిలో పాములపాడు పొలమేర గ్రామ దేవత చౌడేశ్వరీదేవి విగ్రహాన్ని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో ధ్వంసం చేశారు. శుక్రవారం ఉదయం దర్శనానికి వెళ్లిన భక్తులకు ధ్వంసం అయిన విగ్రహం, దేవాలయంలో రాళ్ళు పడి ఉండటం చూసిన భక్తులు గమనించారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని భక్తులు కోరారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లే కీలకం



శిక్షణ ఇస్తున్న డీఈ రవీంద్రారెడ్డి

- నంద్యాల ఇన్‌చార్జి పీఆర్ ఎస్ఈ కే నాగరాజు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖలో జరుగుతున్న అభివృద్ధి పనులకు క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లే కీలకభూమిక పోషించాలని నంద్యాల పీఆర్ ఇన్‌చార్జి ఎస్ఈ కే. నాగరాజు అన్నారు. నంద్యాల పీఐయూ డివిజన్ పరిధిలోని 125 ఇంజనీరింగ్ అసిసెంట్లకు గురువారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ రవీంద్రారెడ్డి, ఏఈ విజయభాస్కర్, ఏఈఈ అమర్‌నాథ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు ఎలా పాటించాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఈ నాగరాజు మాట్లాడుతూ ఇటీవల పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఒక్కో మండలానికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బీటీ రోడ్లు నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో ఈ పనుల జరిపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఐయూ ఈఈ రఘురాంరెడ్డి, డీఈఈ గంగాధర్, ఏఈ ప్రభాకర్, డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హాస్టల్‌లో వసతులు కరువు

● అధ్వానంగా మరుగుదొడ్లు
● ఆరుబయటే విద్యార్థుల స్నానాలు
● మధ్యలో నిలిచిన పెద్దపాడు వసతి గృహం కాంప్లెక్స్ పనులు


ఆరుబయట స్నానం చేస్తున్న విద్యార్థి

కర్నూలు, ఎడ్యుకేషన్ నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య స్వగ్రామం పెద్దపాడులోని వెనకబడిన తరగతుల బాలుర సంక్షేమ వసతి గృహంలో వసతులు కరువయ్యాయి. వసతి గృహంలో దాదాపు 240 మంది విద్యార్థులు ఉంటూ సమీపంలోని ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. హాస్టల్‌లో మరుగుదొడ్లు, స్నానపు గదులు అధ్వానంగా తయారయ్యాయి. కొత్తగా చేపట్టిన మరుగుదొడ్లు, స్నానపు గదుల కాంప్లెక్స్ పనులు అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులు అరుబయటే స్నానాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. హాస్టల్ పరిసరాల్లో పందులు సం చరిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాల నిర్వహణకు నయాపైసా విదల్చలేదు. కేవలం ప్రతిపాదనలకే పరిమితమైందనే విమర్శలున్నాయి. ఎన్డీయే ప్రభుత్వ హయంలోనైనా ప్రభుత్వ వసతి గృహాల పరిస్థితి మారుతుందనే ఆశతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు.



నిరుపయోగంగా మరుగుదొడ్లు, స్నానపు గదులు, హాస్టల్ ప్రాంగణంలో సంచరిస్తున్న పంది

అధికారుల పని తీరు బాగా లేదు

● నగర పంచాయతీ వైస్ చైర్మన్ పీఎన్ అస్లాం


అధికారులను ప్రశ్నిస్తున్న వైస్ చైర్మన్ పీఎన్ అస్లాం

గూడూరు నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ అధికారుల పనితీరు బాగా లేదని, వర్క్ ఆర్డర్ ఇవ్వకపోవడం వల్లే అభివృద్ధి పనులు జరగలేదని వైస్ చైర్మన్ పీఎన్ అస్లాం మండిపడ్డారు. గురువారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ జె వెంకటేశ్వర్లు అధ్యక్షతన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. అనంతరం వైస్ చైర్మన్ అస్లాం మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తి అయినప్పటికీ గత ఏఈ వర్క్ ఆర్డర్ ఇవ్వకపోవడం వల్లే పనులు జరగలేదన్నారు. నూతనంగా నిర్మిస్తున్న నగర పంచాయతీ కార్యాలయం భవనం ఎప్పుడు పూర్తి అవుతుందని, పనులు మధ్యలోనే నిలిపి వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని రెండో వైస్ చైర్మన్ లక్ష్మన్న అన్నారు. దీనిపై కమిషనర్ నాగరాజు మాట్లాడుతూ తన తోపాటు మరికొందరు అధికారులు కొన్ని రోజుల క్రితమే బదిలీపై వచ్చామని గతంలో ఇక్కడ పని చేసిన అధికారులు ఏం చేసారో అన్నది తమకు తెలియదని, ప్రస్తుతం అభివృద్ధి పనులపై దృష్టి పెట్టామన్నారు. సెంట్రల్ గ్రాంట్ కింద రూ.7 కోట్ల 59 లక్షలతోపాటు జనరల్ ఫండ్ వంటివి ఉన్నాయని ఈ నిధులతో అభివృద్ధి పనులు చేయిస్తామన్నారు. శ్మశాన వాటిక, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి సమస్యలను కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నగర పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

శిశువుల సంరక్షణ అందరి బాధ్యత

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



ప్రసంగిస్తున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శిశువుల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ.లీలా వెంకట శేషాద్రి అన్నారు. గురువారం స్థానిక సి. క్యాంపులోని శిశు గృహంలో శిశు రక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం శిశు గృహంలోని వసతులను, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ అధికారి అనూరాధ, డాక్టర్లు శిరీష, నిషిగ్రేస్, జానకి రామిరెడ్డి, స్వచ్ఛంద సేవా సంస్థల అధికారులు పాల్గొన్నారు.

26న కార్మిక సంఘాల మహా ప్రదర్శన



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప

కర్నూలు న్యూసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ ఈనెల 26న తలపెట్టిన దేశవ్యాప్త మహాప్రదర్శన, ధర్నాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ కేంద్ర కార్మిక సంఘాలు, కిసాన్ సంయుక్త మోర్చా రైతు సంఘాలు మహాప్రదర్శన, ధర్నాలు చేపడుతున్నాయన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, నాయకులు రామాంజనే యులు, ఈశ్వర్, డీసీ రెహమాన్, బతుకన్న, తిరుపాలు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం: తహసీల్దారు

కల్లూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభలో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామని కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు అన్నారు. గురువారం ఎ.గోకులపాడులో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రీసర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం తహసీల్దారు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం-136 అర్జీలు రాగా అందులో విస్తీర్ణంలో తేడాలు-57, జాయింట్ ఎల్‌పీఎం-54, మ్యుటేషన్-15, కరెక్షన్-1, క్లాసిఫికేషన్-4 ఉన్నాయి. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, మాజీ సర్పంచు లక్ష్మీవరదారెడ్డి, సింగం సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన వాటికలను అభివృద్ధి చేయండి

కల్లూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కల్లూరు, కృష్ణానగర్ శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని కేజీబీఎస్ రాష్ట్ర నాయకుడు ఎండీ ఆనంద్‌బాబు, కాటికాపరుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం శ్మశాన వాటికలను సందర్శించి సమస్యలను కాటికాపరుల నుండి ఆడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు 1999లో జీవో నెంబరు 1235ను సాధించినా నేటికీ అమలుల్లోకి రాలేదన్నారు. చనిపోయిన వ్యక్తి అంతిమ సంస్కారాలను ప్రశాంతంగా జరుపుకోలేకపోతున్నారని, శ్మశానానికి రస్తా, ప్రహరీ, బోరు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌జి కృష్ణ, ఏసురాజు, టి.లక్ష్మీనారాయణ, చక్రపాణి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్తు: ఎంఈవో


సర్వసతీదేవి విగ్రహానికి పూజలు చేస్తున్న అధికారులు

సి.బెళగల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యతోనే విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాధికారి జ్యోతి అన్నారు. గురువారం బురాన్ దొడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నిర్మలా వసంతకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంఈవో మాట్లాడారు. పాఠశాలలో మండలంలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు నగదు బహుమతి, మెమెంటోలు అందజేశారు. వీటిని గొల్లబుడ్డన్న, లక్ష్మమ్మ, ఉదయకుమార్ విజయరాముడు, డాక్టర్లు శ్రీరాములు, రామచంద్రుడు, తరుణ్, చంద్రశేఖర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం సర్వసతీదేవి విగ్రహానికి ఎంఈవో, హెచ్ఎం, అధికారులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, గురుకుల, మోడల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్ బలరాముడు, వంశీమోహన్, ఎస్ఐ తిమ్మారెడ్డి, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ డిష్ వెంకటేశ్, గ్రామ సర్పంచ్ రామాంజినేయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కర్నూలు కల్చరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, బాలసాయి కంటి ఆసుపతుల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీతారాం నగర్‌లోని అక్షర పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వృద్ధులు, చిన్నారులకు కంటి, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణుడు జయప్రకాశ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల కళ్ల సంరక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రంగనాయకులు, లయన్స్ క్లబ్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విద్యాదేవి పాల్గొన్నారు.

మల్లెల రాజశేఖర్‌కు ఘన స్వాగతం


మల్లెల రాజశేఖర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు, పొదుపు మహిళలు

ఓర్వకల్లు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్‌కు అర్చకులు మనోహర్ శర్మ, పొదుపు మహిళలు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. గురువారం ఆయన స్వగ్రామమైన హుశేనాపురం గ్రామానికి చేరుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు రాజశేఖర్ దంపతులను పూలమాలలు, శాలువలతో సన్మానించారు. జాతీయ రహదారి నుంచి గ్రామంలోని సంత మార్కెట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని శివాలయం, ఆంజనేయ స్వామి, దర్గా, మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ టీటీడీపీ బోర్డు సభ్యుడిగా నియమించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్ బాషా, కేవీ మధు, ప్రశాంత్, సుధాకర్, గొల్ల నాగరాజు, కాకి దేవేంద్ర, నాగభూషణం శెట్టి, ఖాదర్‌బాషా, పలు గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు.

ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట


చెక్కులు పంపిణీ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. గురువారం పాణ్యం నియోజకవర్గంలో సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.9,08,000 లక్షల చెక్కులను గౌరు చరిత అర్హులకు అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు: ఎంపీడీవో

సి.బెళగల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని ఎంపీడీవో రాణెమ్మ హెచ్చరించారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలోని గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా రావడంలేదని సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు.

ఆర్‌యూ అభివృద్ధికి సహకరించండి

సీఎం చంద్రబాబును కలిసిన జేఏసీ నాయకులు


చంద్రబాబుతో జేఏసీ నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూని వర్సిటీ అభివృద్ధికి సహకరించాలని సీఎం చంద్రబాబును రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ ఛైర్మన్ బీ.శ్రీరాములు కోరారు. గురువారం రాత్రి రాష్ట్ర సచివాలయంలో చంద్రబాబును కలిసి రాయల సీమ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కొత్త కోర్సులు, ఉపాధి కోర్సులను తేవ్వాలని కోరారు.

ఈత పోటీల్లో జిల్లాకు పతకాలు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పల్నాడులోని నరసరావుపేటలో ఈనెల 5 నుంచి 6వరకు నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా స్విమ్మర్లు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. అండర్-19 బాలుర విభాగంలో మనోజ్, మనీష్, షేక్ సామియా తంజీమ్, అండర్-17 బాలికల విభాగంలో వి.హేమలత, అండర్-17 బాలుర విభాగంలో షేక్ మహ్మద్‌షాకీబ్, వైశాలి బి.సురేఖ, అండర్-14 బాలబాలికల విభాగంలో బి.సిరి, చేతన్‌రాజ్ సిల్వర్, కే.శృతి పథకాలు సాధించారు. జిల్లాకు 7 బంగారం, 5 సిల్వర్ 5 బ్రౌంజ్ మెడల్స్ లభించాయి. విజేతలకు పల్నాడు జిల్లా ఈత కోచ్ సురేష్ కుమార్, కర్నూలు కోచ్ నటరాజారావు, తిరుపతి కోచ్ చక్రవర్తి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి గిడ్డయ్య, మేనేజర్ విజయలక్ష్మి, జిల్లా ఈత సంఘం కార్యదర్శి నరసింహాచారి, కార్యదర్శి రామకృష్ణ యాదవ్, రమేష్, దస్తగిరిలు విజేతలకు అభినందనలు తెలిపారు.

బేస్‌బాల్ టోర్నమెంటు వాయిదా

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 9వ తేదీ నుంచి 11 వరకు జరిగే 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాలబాలికల బేస్‌బాల్ పోటీలు వర్షం కారణంగా వాయిదా వేశారని ఉమ్మడి జిల్లాల స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గిడ్డయ్య, శ్రీనాథ్‌లు తెలిపారు. తదుపరి జరిగే తేదీలను త్వరలో ప్రకటిస్తామని చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి తెలిపారు.

దస్తగిరికి ఆకాశవాణిలో బీ-హై ఆర్టిస్టుగా గుర్తింపు



కర్నూలు కల్చరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు, విశ్రాంత అధ్యాపకుడు పి.దస్తగిరి కడప ఆకాశవాణి కేంద్రం బీ-హై ఆర్టిస్టుగా ఇచ్చిన గుర్తింపు ధ్రువీకరణ పత్రం గురువారం అందుకున్నారు. గత 30 ఏళ్లకు పైగా ఆయన కడప, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాదు ఆకాశవాణి కేంద్రాలతోపాటు కర్నూలు ఆకాశవాణి కేంద్రంలో బీ గ్రేడ్ ఆర్టిస్టుగా రంగస్థల పద్యాలు ఆలపిస్తున్నారు. ఆయన ముఖ్య పాత్రలు ధరించి శ్రీకృష్ణ తులాభారం, సత్య హరిశ్చంద్ర, గయోపాఖ్యానం, చింతామణి తదితర నాటకాలను ఆకాశవాణి ద్వారా ప్రసారమయ్యాయి. దస్తగిరికి బీ-హై ఆర్టిస్టుగా గుర్తింపు రావడంపై కర్నూలుకు చెందిన పలువురు రంగస్థల కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

పేద విద్యార్థికి చేయూత


విద్యార్థికి చెక్కును అందజేస్తున్న కమిషనర్, సభ్యులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేద ఎంబీబీఎస్ విద్యార్థి ఎం.అబ్బుత్ కుమార్‌కు చేయూతనిచ్చారు. గురువారం నగర పాలక కార్యాలయంలో కమిషనర్ రవీంద్రబాబు చేతుల మీదుగా రూ.50వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్ మాట్లాడుతూ గోనెగండ్ల మండలం అల్వాల గ్రామానికి చెందిన అబ్బుత్‌కుమార్ తల్లిదండ్రులు నిరుపేదవారన్నారు. చిన్నటేకూరు రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసి నీట్‌లో మంచి మార్కులు సాధించి కడప మెడికల్ కాలేజీలో సీట్ సాధించారన్నారు. స్లైడింగ్ కింద ప్రస్తుతం అనంతపురం మెడికల్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. కాలేజీ, హాస్టల్ ఫీజు కింద సాయం చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఈరన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి చంద్రశేఖర్, సభ్యులు విశ్రాంత పీఆర్ ఎస్ఈ సురేంద్రనాథ్, సోమన్న పాల్గొన్నారు.

'రైతులు సహకరించాలి'

సి.బెళగల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు రైతులు సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాల యంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సి.బెళగల్, బ్రాహ్మణదొడ్డి, పోలకల్లు, కొండాపురం గ్రామాల్లో ఈనెల 20న నామినేషన్లు, 21న కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, ఎల్లెల్సీ ఏఈలు సూర్యప్రకాశ్, ఉదయ పాల్గొన్నారు.

అందరికీ ఇంటి వద్దే క్యాన్సర్ పరీక్షలు: డీఎంహెచ్‌వో


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన అందరికీ ఇంటి వద్దనే నోటి, బ్రెస్ట్, సర్వేకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ తెలిపారు. గురువారం ఉదయం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ క్యాన్సర్ పరీక్షలను శిక్షణ పొందిన వైద్య నిపుణులు నిర్వ హిస్తారని, గ్రామీణ ప్రాంతాల్లో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశాలు, పట్టణ ప్రాంతాల్లో యూపీహెచ్‌సీ, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు స్క్రీనింగ్‌లను పర్యవేక్షిస్తారన్నారు. లక్షణాలు ఉన్న కేసులను పీహెచ్‌సీ లకు రెఫర్ చేసి మరింత పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ర్యాలీలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ ఐ.హేమలత, డీపీఎంవో ఉమా, డీపీవో విజయరాజు, డెమో శ్రీనివాసులు, ప్రాంతీయ శిక్షణ కేంద్రం (పీమేల్) ప్రిన్సిపాల్ జయలక్ష్మి, నర్సింగ్ విద్యార్థినులు, ఆశాలు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: ఈ నెల 14 నుంచి ఎన్‌సీడీసీడీ 3.0 సర్వేలో భాగంగా 18 ఏళ్లు నిండిన వారందరికీ ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారులు జయంతి, భాస్కర్ తెలిపారు. గురువారం జాతీయ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని వైద్య సిబ్బంది విద్యార్థులతో కలిసి లద్దగిరి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసయాదవ్, సీహెచ్‌వో శాంత, సూపర్‌వైజర్ శారద, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


లద్దగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జనరల్ సర్జరీ ప్రొఫెసర్‌గా డాక్టర్ జయరాం



కర్నూలు హాస్పిటల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జనరల్ సర్జరీ విభాగంలో పని చేస్తున్న డాక్టర్ జే జయరాం ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. ఈ నెల 6న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు పదోన్నతి పొందిన డాక్టర్ జయరాం విధుల్లో చేరారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.చిట్టినరసమ్మ ఆయనకు నియమాక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ పేదరోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

10న సీతారాముల కల్యాణం

కర్నూలు అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని పేట శ్రీరామాలయంలో శతాబ్ది బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 10న సీతారాముల కల్యాణం, ఉసిరి చెట్టుకు పూజ, ఊంజల సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు మాళిగి హనుమేషాచార్ తెలిపారు. గురువారం శ్రీరామాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేట రామాలయంలో 1925 నుంచి ఏటా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయని, 2025 నాటికి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా శతాబ్ది బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈనెల 10న ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీ నాయ కులు మాళిగి భానుప్రకాశ్, విజయ వాసు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకును శుభ్రపరచండి

ఓర్వకల్లు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో ఉన్న వాటర్ ట్యాంకులను శుభ్రపరిచి ప్రజలకు సురక్షితమైన తాగు నీరు అందించాలని డీఎల్పీవో లక్ష్మి, ఈవోఆర్డీ సుబ్బరాయుడు అన్నారు. గురువారం మండలంలోని నన్నూరు, లొద్దిపల్లె గ్రామాల్లో వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్ ట్యాంకులను శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు.

ఘనంగా సీవీ రామన్ జయంతి


సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

కర్నూలు కల్చరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భౌతిక శాస్త్రంలో తొలి నోబెల్ బహుమతి పొందిన సర్ సీవీ రామన్ జయంతిని గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాశ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో రామన్ అందించిన అనేక పరిశోధనలు నేటి తరానికి కూడా ఉపయుక్తంగా నిలుస్తున్నాయని కొనియా డారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయ అధికారి వి. పెద్దక్క, లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్‌కే బాషా పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్య కోసం ఉద్యమించాలి: పీడీఎస్‌యూ

కల్లూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విద్య కోసం ఉద్యమించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం కల్లూరు మండలం బొల్లవరంలో నీలం రామచంద్రయ్య స్తూపానికి విద్యార్థి అమరవీరుల శిలాఫలకాన్ని పూర్వ పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు శేషఫణి, మల్లికార్జున ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జాతీయ విద్యావిధానాన్ని ప్రైవేటీకరించేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధమైందన్నారు. కూటమి ప్రభు త్వం నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాలని, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో మూసివేత జీవో నెంబరు 118ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, దామోదర్, శశికాంత్, నిఖిల్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు హైపో క్లోరైడ్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలో సీజనల్ వ్యాధులను నివారించేందుకు హైపో క్లోరైడ్ ద్రావణం సరఫరా చేయాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు రాయలసీమ హైస్ట్రెంత్ హైపో లిమిటెడ్ ఛైర్మన్‌కు లేఖ రాశారు. ఈ మేరకు మంత్రి టీజీ భరత్ ఆదేశాలతో ఉచితంగా 1,50,000 లీటర్ల హైపోక్లోరైడ్ ద్రావణం నగరానికి చేరుకుంది. గురువారం సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో నగరం లోని పలు ప్రాంతాలలో ట్రాక్టర్లతో హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేస్తున్నారు. టీజీవీ గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా వచ్చిన హైపో క్లోరైడ్ ద్రావణం నగరంలోని కాలువలు, నివాస ప్రాంతాలలో పిచికారి చేశారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

కర్నూలు కల్చరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఉచితంగా భగవద్గీత పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా కర్నూలు రామకృష్ణ సేవా శ్రమం నిర్వాహకుడు స్వామి అర్చనానంద హాజరై విద్యార్థులకు ఉచితంగా భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామి అర్చనానంద మాట్లాడుతూ ప్రపంచంలోని సారాంశమంతా గీతలోనే ఉందన్నారు. అనంతరం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు మల్లు వేంకటరెడ్డి మాట్లాడారు. ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరెడ్డి, వివేకా నంద స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ ఎం.నాగఫణిశాస్త్రి, రామకృష్ణ భావ ప్రచార సమితి అధ్యక్షుడు శరత్‌చంద్ర, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయంలో రికార్డుల పరిశీలన

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి గురువారం పరిశీలించారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, డీఈవో శామ్యూల్ పాల్ ద్వారా పాఠశాలల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే కార్యాల యంలోని అధికారులు, ఉద్యోగులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉచితంగా డప్పు కొట్టమని బెదిరించే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏపీ డప్పుకళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి బి. కరుణాకర్ డిమాండ్ చేశారు. గురువారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు మండలంలోని జి.సింగవరం, ఎదురూరు గ్రామాలలో సచివాలయ అధికారులు ఉచితంగా డప్పు కొట్టకపోతే మీ పింఛన్లు తీసేస్తామంటూ బెదిరిస్తున్నారని అన్నారు. చక్రపాణి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

మద్దికెర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని ఏవో రవి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో వరి, ఉల్లి పంటలను పరిశీలించారు. పొలంగట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి, గడ్డి లేకుండా చేసుకోవాలన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఆలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆలూరు ఎస్ఐ వెంకట నరసింహులు, న్యాయవాది వాయుజోత్తం రావ్ సూచించారు.. గురువారం రాఘవేంద్ర డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

శతాధిక వృద్ధురాలి మృతి


తుగ్గలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగనాయనదొడ్డి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పెద్ద లక్ష్మమ్మ (106) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. లక్ష్మమ్మ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో సేవలందిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాటి డిప్యూటీ సీఎం కేఈ సహకారంతో గ్రామంలో 150 ఇళ్లు మంజూరు చేయించింది. ఆమె మృతిపట్ల పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సంతాపం తెలిపారు. నాయకులు రాముడు, సుధాకర్, మాజీ సర్పంచ్ నాగలక్ష్మి, వెంకట్రాముడు, రామారావు ఆమె భౌతికకాయానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. లక్ష్మమ్మకు ఇద్దరు కుమారులతో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

క్రీడాకారుడికి ప్రోత్సాహం

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెద్ద హరివాణం జడ్పీహెచ్ పాఠశాల పదో తరగతి విద్యార్థి బోయ గర్జప్పకు వాల్మీకి ఉద్యోగులు రూ.5వేలు అందజేశారు. నరసయ్య, లక్ష్మీకాంత, సత్తన్న, రమేష్ నాయుడు మాట్లాడుతూ జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థి మధ్యప్రదేశ్‌లోని నర్సింగాపూర్ వెళ్లేందుకు రవాణా ఖర్చులకు సాయం చేశామన్నారు. సుధాకర బాబు, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయండి

ఆదోని రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాగునీరు సరఫరా చేయాలని సలకలకొండ గ్రామస్థులు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు మొర పెట్టుకున్నారు. గురువారం ఆయన ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుసూదనాచారితో కలిసి గ్రామంలో పర్యటించారు. రెండు రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.







పబ్లిక్ నోటీస్

తేది:08-11-2024

కర్నూల్ జిల్లాకి చెందిన అనేక సర్వే నంబర్లలో ఉన్న డ్రై అగ్రికల్చర్ భూములను మా క్లయింట్ **సెవెన్ రెన్యూవబుల్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు** వారు భూమి యజమానుల వద్ద నుండి కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు సాధారణ ప్రజలకు సమాచారం అందించారు. ఆ సమాచారం మేరకు కొందరు భూమి యజమానులు మా క్లాయింట్ వారికి భూములు అమ్ముటకు సమ్మతించారు. భూమి మరియు దాని యజమానుల వివరాలు షెడ్యూల్ పోర్షన్‌లో క్రింద పేర్కొనబడ్డాయి. ఈ క్రింద పేర్కొన్న యజమానులు వారు వారి షెడ్యూల్ ఆస్తులపై సంపూర్ణ యజమాన హక్కులు కలిగి సదరు భూములపై స్వాధీన అనుభవంతో ఉన్నారు.

ఏదైనా వ్యక్తి / ఆ సంస్థ / బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ ఏదైనా హక్కు, టైటిల్, క్లెయిమ్, ప్రయోజనం, ఎస్టేట్, వాటా, డిమాండ్ లేదా మరియేతర హక్కు కలిగి ఉంటే లేదా సేల్, ఐటీటీ ద్వారా షెడ్యూల్ ప్రాపర్టీలు లేదా దానిలోని ఏదైనా భాగానికి సంబంధించి ఏదైనా స్వభావం కలిగి ఉంటే లేదా క్లెయిమ్ చేస్తే, మార్టిడి, అసైన్‌మెంట్, ఛార్జ్, దానము, ఒడంబడిక, ట్రస్ట్, లైసెన్స్, అద్దె, వాటా, ఉప-అద్దె, వారసత్వం, దావా, అనుమతి, లీజు, ఉప-లీజు, తాత్కాలిక హక్కు తనఖా, సడలింపు, రూపకల్పన, టిక్కెస్ట్, హైపోథికేషన్, భారాలు, స్వాధీనం అభివృద్ధి హక్కులు, పార్ట్ పెర్ఫార్మెన్స్‌లో స్వాధీనం, భాగస్వామ్యం, కుటుంబ ఏర్పాటు / సెటిల్‌మెంట్, లిస్ పెండెన్‌లు, ఏదైనా న్యాయస్థానం యొక్క డిక్రీ ఆర్డర్ లేదా ఎలాగైనా, చట్టం యొక్క ఆపరేషన్ ద్వారా లేదా మరేదైనా, మద్దతు పత్రాలతో పాటుగా తమ అభ్యంతరాలను దాఖలు చేయవలసి ఉంటుంది. ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 7 (ఏడు) రోజులలోపు అభ్యంతరాలను ఈ క్రింద కనపరచిన చిరునామా నందు దాఖలు చేయడంలో విఫలమైతే, షెడ్యూల్‌లో లేదా దాని మీద లేదా దానికి సంబంధించి ఎలాంటి ప్రతికూల హక్కు, టైటిల్ ఆసక్తి, వాటా, దావా లేదా డిమాండ్ ఉండదని భావించబడుతుంది. ఆస్తి వివరములు.

భూమి మరియు దాని యజమానుల షెడ్యూల్ మరియు వివరాలు వరుసగా

వ. సం.	రైతు పేరు	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణం	సేల్ ల్యాండ్	గ్రామం	మండలం
1	కురువ ఎర్రిస్వామి S/o కురువ తిమ్మన్న	L.P.NO. 209	5.083	0.6	తుంబలబీడు	ఆలూరు
	ఆలూరు రాజశేఖర్ S/o ఆలూరు పెద్దఈరన్న	L.P.NO. 208	1.512	0.44	తుంబలబీడు	ఆలూరు

బి. శివకృష్ణ, అడ్వకేట్, షాప్ నెం.3, 4వ ఫ్లోర్, స్కంద బిజినెస్ పార్క్, అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్, కర్నూలు. సెల్ : 8008086291





పబ్లిక్ నోటీస్

తేది:08-1:-2024

కర్నూల్ జిల్లాకి చెందిన అనేక సర్వే నంబర్లలో ఉన్న డ్రై అగ్రికల్చర్ భూములను మా క్లయింట్ **ప్రాజెక్ట్ ఎలెవెన్ రెన్యూవబుల్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు** వారు భూమి యజమానుల వద్ద నుండి కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు సాధారణ ప్రజలకు సమాచారం అందించారు. ఆ సమాచారం మేరకు కొందరు భూమి యజమానులు మా క్లాయింట్ వారికి భూములు అమ్ముటకు సమ్మతించారు. భూమి మరియు దాని యజమానుల వివరాలు షెడ్యూల్ పోర్షన్‌లో క్రింద పేర్కొనబడ్డాయి. ఈ క్రింద పేర్కొన్న యజమానులు వారు వారి షెడ్యూల్ ఆస్తులపై సంపూర్ణ యజమాన హక్కులు కలిగి సదరు భూములపై స్వాధీన అనుభవంతో ఉన్నారు.

ఏదైనా వ్యక్తి / ఆ సంస్థ / బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ ఏదైనా హక్కు, టైటిల్, క్లెయిమ్, ప్రయోజనం, ఎస్టేట్, వాటా, డిమాండ్ లేదా మరియేతర హక్కు కలిగి ఉంటే లేదా సేల్, ఐటీటీ ద్వారా షెడ్యూల్ ప్రాపర్టీలు లేదా దానిలోని ఏదైనా భాగానికి సంబంధించి ఏదైనా స్వభావం కలిగి ఉంటే లేదా క్లెయిమ్ చేస్తే, మార్టిడి, అసైన్‌మెంట్, ఛార్జ్, దానము, ఒడంబడిక, ట్రస్ట్, లైసెన్స్, అద్దె, వాటా, ఉప-అద్దె, వారసత్వం, దావా, అనుమతి, లీజు, ఉప-లీజు, తాత్కాలిక హక్కు తనఖా, సడలింపు, రూపకల్పన, టిక్కెస్ట్, హైపోథికేషన్, భారాలు, స్వాధీనం అభివృద్ధి హక్కులు, పార్ట్ పెర్ఫార్మెన్స్‌లో స్వాధీనం, భాగస్వామ్యం, కుటుంబ ఏర్పాటు / సెటిల్‌మెంట్, లిస్ పెండెన్‌లు, ఏదైనా న్యాయస్థానం యొక్క డిక్రీ ఆర్డర్ లేదా ఎలాగైనా, చట్టం యొక్క ఆపరేషన్ ద్వారా లేదా మరేదైనా, మద్దతు పత్రాలతో పాటుగా తమ అభ్యంతరాలను దాఖలు చేయవలసి ఉంటుంది. ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 7 (ఏడు) రోజులలోపు అభ్యంతరాలను ఈ క్రింద కనపరచిన చిరునామా నందు దాఖలు చేయడంలో విఫలమైతే, షెడ్యూల్‌లో లేదా దాని మీద లేదా దానికి సంబంధించి ఎలాంటి ప్రతికూల హక్కు, టైటిల్ ఆసక్తి, వాటా, దావా లేదా డిమాండ్ ఉండదని భావించబడుతుంది. ఆస్తి వివరములు.

భూమి మరియు దాని యజమానుల షెడ్యూల్ మరియు వివరాలు వరుసగా

వ. సం	రైతు పేరు	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణం	సేల్ ల్యాండ్	గ్రామం	మండలం
1	కత్రికి శివప్రసాద్‌రెడ్డి S/o కత్రికి పాండురంగారెడ్డి	184	9.28	1.04	ఆస్పరి	ఆస్పరి
2	కురువలదొడ్డి రామచంద్రప్ప S/o హనుమంతప్ప	504	8.66	1.04	పెద్దహోతూరు	ఆలూరు
3	జొహరాపురం కుమార్ S/o జొహరాపురం నాగప్ప	275-B2	4.00	0.69	పెద్దహోతూరు	ఆలూరు
	జొహరాపురం నాగప్ప S/o జొహరాపురం నాగప్ప	275	2.65		పెద్దహోతూరు	ఆలూరు
	కురువలదొడ్డి రామచంద్రప్ప S/o కె.తిమ్మప్ప	275-B1	6.65	0.35	పెద్దహోతూరు	ఆలూరు

బి. శివకృష్ణ, అడ్వకేట్, షాప్ నెం.3, 4వ ఫ్లోర్, స్కంద బిజినెస్ పార్క్, అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్, కర్నూలు. సెల్ : 8008086291







పబ్లిక్ నోటీస్

తేది:08-11-2024

కర్నూల్ జిల్లాకి చెందిన అనేక సర్వే నంబర్లలో ఉన్న డ్రై అగ్రికల్చర్ భూములను మా క్లయింట్ **ప్రాజెక్ట్ సిక్స్టీన్ రెన్యూవబుల్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు** వారు భూమి యజమానుల వద్ద నుండి కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు సాధారణ ప్రజలకు సమాచారం అందించారు. ఆ సమాచారం మేరకు కొందరు భూమి యజమానులు మా క్లాయింట్ వారికి భూములు అమ్ముటకు సమ్మతించారు. భూమి మరియు దాని యజమానుల వివరాలు షెడ్యూల్ పోర్షన్‌లో క్రింద పేర్కొనబడ్డాయి. ఈ క్రింద పేర్కొన్న యజమానులు వారు వారి షెడ్యూల్ ఆస్తులపై సంపూర్ణ యజమాన హక్కులు కలిగి సదరు భూములపై స్వాధీన అనుభవంతో ఉన్నారు.

ఏదైనా వ్యక్తి / ఆ సంస్థ / బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ ఏదైనా హక్కు, టైటిల్, క్లెయిమ్, ప్రయోజనం, ఎస్టేట్, వాటా, డిమాండ్ లేదా మరియేతర హక్కు కలిగి ఉంటే లేదా సేల్, ఐటీటీ ద్వారా షెడ్యూల్ ప్రాపర్టీలు లేదా దానిలోని ఏదైనా భాగానికి సంబంధించి ఏదైనా స్వభావం కలిగి ఉంటే లేదా క్లెయిమ్ చేస్తే, మార్టిడి, అసైన్‌మెంట్, ఛార్జ్, దానము, ఒడంబడిక, ట్రస్ట్, లైసెన్స్, అద్దె, వాటా, ఉప-అద్దె, వారసత్వం, దావా, అనుమతి, లీజు, ఉప-లీజు, తాత్కాలిక హక్కు తనఖా, సడలింపు, రూపకల్పన, టిక్కెస్ట్, హైపోథికేషన్, భారాలు, స్వాధీనం అభివృద్ధి హక్కులు, పార్ట్ పెర్ఫార్మెన్స్‌లో స్వాధీనం, భాగస్వామ్యం, కుటుంబ ఏర్పాటు / సెటిల్‌మెంట్, లిస్ పెండెన్‌లు, ఏదైనా న్యాయస్థానం యొక్క డిక్రీ ఆర్డర్ లేదా ఎలాగైనా, చట్టం యొక్క ఆపరేషన్ ద్వారా లేదా మరేదైనా, మద్దతు పత్రాలతో పాటుగా తమ అభ్యంతరాలను దాఖలు చేయవలసి ఉంటుంది. ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 7 (ఏడు) రోజులలోపు అభ్యంతరాలను ఈ క్రింద కనపరచిన చిరునామా నందు దాఖలు చేయడంలో విఫలమైతే, షెడ్యూల్‌లో లేదా దాని మీద లేదా దానికి సంబంధించి ఎలాంటి ప్రతికూల హక్కు, టైటిల్ ఆసక్తి, వాటా, దావా లేదా డిమాండ్ ఉండదని భావించబడుతుంది. ఆస్తి వివరములు.

భూమి మరియు దాని యజమానుల షెడ్యూల్ మరియు వివరాలు వరుసగా

వ. సం	రైతు పేరు	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణం	సేల్ ల్యాండ్	గ్రామం	మండలం
1	దూదేకుల మహబూబ్‌బాషా S/o దూదేకుల అక్బర్	669-B3, 669-B4	2.02, 1.76	0.39, 0.05	జొహరాపురం	ఆస్పరి
	దూదేకుల షేక్షావలి S/o దూదేకుల అక్బర్	669-B1, 669-B2	1.88, 2.41	0.22, 0.38	జొహరాపురం	ఆస్పరి
2	కురువ రాజశేఖర్ S/o కురువ యంకన్న	163-D	3.72	0.94	మొలగవల్లి	ఆలూరు
	కురువ రాంబాబు S/o కురువ యంకన్న	163-D	3.72	0.10	మొలగవల్లి	ఆలూరు
3	బంగారు గౌరమ్మ W/o బంగారు హనుమంతు	312	5.44	0.58	మొలగవల్లి	ఆలూరు
	బోయిని సరోజమ్మ W/o బోయిని రవికుమార్	310-A	2.41	0.45	మొలగవల్లి	ఆలూరు
4	కె. అనిల్‌కుమార్ S/o కె. నాగేశ్వరరావు	709-1	16.04	1.04	జొహరాపురం	ఆలూరు
5	బంగారి ఈరన్న S/o బంగారి హనుమంతు	503-1	9.00	1.04	జొహరాపురం	ఆలూరు

బి. శివకృష్ణ, అడ్వకేట్, షాప్ నెం.3, 4వ ఫ్లోర్, స్కంద బిజినెస్ పార్క్, అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్, కర్నూలు. సెల్ : 8008086291



● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని హోటళ్లను ఆయన తనిఖీ చేశారు. అక్కడ సాంబర్‌ను ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేయడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటల్ యాజమాన్యానికి జరిమానా విధించారు. డీఈ నీరజ, డీఈఈ రాజునాయక్ ఉన్నారు.

నెంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం: బీవీ

ఎమ్మిగనూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీనివాస, సోమేశ్వర, షరాఫ్ బజార్, సోగనూరు రోడ్డు, అంబేడ్కర్ సర్కిళ్లు, ఎద్దుల మార్కెట్ రోడ్డును ఆయన పరిశీలించారు. అలాగే కలుగొట్ల రోడ్డు ఎంబీ చర్చి దగ్గర సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్, కౌన్సిలర్ రామదాసు గౌడ్, వహిద్, నాయకులు సుందరరాజు, ముల్లా కలీముల్లా, రంగస్వామి గౌడ్, జయన్న, తురేగల్ నజీర్, కటారి రాజేంద్ర, అల్తాఫ్, నవాజ్, అంబేడ్కర్, శాలేమ్, వెంకటేశులు, రాజు, కృష్ణ, ఈరన్న పాల్గొన్నారు.


నాగలదిన్నెలో షెడ్లు తొలగించాలి: బీవీ

నందవరం: మండలంలోని నాగలదిన్నె గ్రామంలో స్థలాలు కబ్జా చేసిన వారి షెడ్లు తొలగించాలని హౌసింగ్ డీఈ ప్రసాద్, తహసీల్దారు శ్రీనివాసులుకు ఎమ్మెలే బీవీ జయనాగేశ్వరరెడ్డి సూచించారు. గురువారం నాగలదిన్నెలో రోడ్డు పనులు, సీసీ, డ్రైనేజీలు పనులను ప్రారంభించారు. అమెరికా, హైదరాబాద్, బెంగళూరు, తెలంగాణలో ఉన్నవారి పేరిట పట్టాలు ఇచ్చారని అన్నారు. దీంతో వైసీపీ నాయకులు ఆ స్థలాలను కబ్జా చేశారని తెలిపారు. మాజీ జడ్పీటీసీ ఈరన్న గౌడు, క్లస్టర్ ఇన్‌చార్జులు కాశీంవలి, గోపాల్, వెంకట్రామిరెడ్డి, టి.ఈరన్న, జబ్బార్, వహాబ్, కిషోర్, సుధీర్, వీరేష్, తిమ్మప్ప, మల్లేష్, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం: నందవరం మండల పాత్రికేయులకు ఇంటి పట్టాలు ఇప్పించి స్థలాలు చూపించిన ఎమ్మెల్యే బీవీకి పాత్రికేయులు గురువారం నాగలదిన్నెలో ఘనంగా సన్మానించారు. మిగిలిన పాత్రికేయులందరికీ పట్టాలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే అన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ









తిరుమల మెట్ల ఉత్సవంలో పీఠాధిపతి

మంత్రాలయం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు తిరుమలలో మెట్ల ఉత్సవాన్ని ప్రారంభించారు. గురువారం శ్రీగురు సార్వభౌమ దాససాహిత్య ప్రాజెక్టు ఏర్పాటు చేసిన మెట్ల ఉత్సవాన్ని ప్రారంభించి మెట్ల ద్వారా సామూహిక శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ఆధ్యాత్మికత కోసం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టీటీడీ ఈవో శ్యామలరావు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు టీటీడీ ఈవో శ్యామలరావుకు శేషవస్త్రం, మెమెంటో, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

హెచ్ఆర్ఎఫ్ మహాసభను జయప్రదం చేయండి

కోసిగి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల వేదిక 10వ జిల్లా మహాసభలు ఈ నెల 9వ తేదీ శనివారం కోసిగిలో నిర్వహిస్తున్నామని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు ఉరుకుందప్ప తెలిపారు. గురువారం కోసిగిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కోసిగిలోని హాల్వి రోడ్డులో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాలులో మానవ హక్కుల వేదిక 10వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ మహాసభలకు కమిటీ సభ్యులు చంద్రశేఖర్, వీఎస్ కృష్ణ, వై.రాజేష్ హాజరవుతు న్నారన్నారు. కార్యక్రమంలో వేదిక జిల్లా కార్యదర్శి తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారాలను అరికట్టాలి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, మహిళలపై హత్య, అత్యాచారాలను అరికట్టాలని పీడీఎస్‌వో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశ అన్నారు. పట్టణంలోని స్థానిక మక్బూల్ ఫంక్షన్ హాలులో సురేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆశ, తిరుమలేష్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఘటనలు అందర్నీ ఆందోళనకు గురి చేస్తున్నాయని అన్నారు. పసిపిల్లల నుంచి పండు ముదుసలి వరకు ఏ క్షణంలో ఏమి జరుగుతుందోననే అభద్రత భావంతో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేరాలకు పాల్పడుతున్న వారిలో మద్యం, మత్తు పదార్థాలకు బానిసలైన మైనర్లు, యువత ఉండడం గమనార్హం అన్నారు. ప్రభుత్వం మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని కోరారు. కార్యక్రమంలో ఇమ్రాన్, ప్రతాప్, శ్రావణి, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

వలసలు వెళ్లొద్దు

పెద్దకడుబూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వలసలు వెళ్ల వద్దని, ఉపాధి పనులు కల్పిస్తామని ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో జయరాముడు అన్నారు. గురువారం పెద్దకడబూరులో గ్రామస్థులకు వలసలపై అవగాహన కల్పించారు. ఏపీవో ఖాదర్ బాషా, ఉపాధి సిబ్బంది ఉన్నారు

మంత్రాలయం: ఎవరూ కూడా వలసలు వెళ్లొద్దు.. రోజుకు రూ.300లు ఉపాధి పనుల కూలీ అందుతుందని ఏపీవో తిమ్మారెడ్డి, ఈసీ శ్రీనివాసులు అన్నారు. గురువారం సుంకేశ్వరి, వగరూరు గ్రామాల్లో వలసలు వెళ్లవద్దు, సొంతూరులోనే ఉపాధి కల్పించి రోజుకు రూ.300 ఉపాధి పొందేటట్లు కల్పిస్తామని తెలిపారు.

పెద్దనేలటూరులో టీబీ పరీక్షలు

గోనెగండ్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనేలటూరు గ్రామంలో గురువారం 126 మందికి టీబీ(క్షయ) వ్యాధి పరీక్షలు నిర్వహించినట్లు టీబీ సూపర్‌వైజర్ వేణుగోపాలాచారి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని టీబీ వ్యాధి గ్రస్తులకు గుర్తించిన వెంటనే ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. మండలంలో 15 వ తేది వరకు ఉచిత టీబీ మొబైల్ ఎక్స్‌రే వాహనం పర్యటిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీబీ సూపర్ వైజర్ మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టుషాపులను అరికట్టడంలో విఫలం



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బెల్టుషాపులను అరికట్టడంలో ఎక్సైజ్ అధికారులు విఫలమయ్యారని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న ఆరోపించారు. గురువారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. నూతన మద్యం పాలసీ విధానంతో బెల్టుషాపులు అధికమయ్యాయన్నారు. ఏ గ్రామంలో చూసినా రెండు నుంచి నాలుగు వరకు బెల్టుషాపులు వెలిశాయని, ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్టుషాపులను అరికట్టాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి చినన్న, తిమ్మగురుడు, కేసీ జబ్బార్, విజయేంద్ర, సమీఉల్లా, దాదావలి, ఖాదర్, సమీర్‌లు పాల్గొన్నారు.

'మనిషి జీవన గతిని మార్చేది భగవద్గీత'

పెద్దకడుబూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భగవద్గీతను చదివితే మనిషి జీవన గతిని మారుస్తుందని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి అన్నారు. గురువారం పెద్దకడబూరులోని జిల్లా పరిషత్ పాఠశాలలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీనివాసులు రెడ్డి, భీమిరెడ్డి ఆధ్వర్యంలో భగవద్గీత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ స మాజంలో మార్పు రావాలంటే దానికి విద్యార్థి దశ కీలక మని అన్నారు. అన ంతరం భగవద్గీ తను ఆచరిస్తే జరిగే ప్రయోజనాలను వి వరించారు. కార్య క్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసన్న గౌడ్, గో సంరక్షణ ప్రముఖ్ భీమలింగా రెడ్డి, పాఠ శాల కమిటీ అధ్య క్షులు స్వామిరాజు, పాఠశాల హెచ్ఎం ఉమా రాజేశ్వరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌశల్ పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలి

ఎమ్మిగనూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ సైన్స్ సిటీ, ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి సహకారంతో భారతీయ విజ్ఞాన మండలి ప్రతి ఏటా నిర్వహించే కౌశల్ ప్రతిభాన్వేషణ పోటీలకు ఈనెల 15లోపు పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా కౌశల్ కో-ఆర్డినేటర్ అడికి రంగస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 8,9,10తరగతులకు చెందిన విద్యార్థుల పేర్లు ఉపాధ్యాయులు నమోదు చేయాలన్నారు. క్విజ్, ఫిల్మ్ అంశాలలో పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈనెల 202, 21,22తేదీల్లో పాఠశాల స్థాయి, డిసెంబరు 6న జిల్లాస్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారన్నారు.









